

మున్సిపల్ కార్మికుల్ని పర్మినెంట్ చేయాలి 8లో



ఈపీడీసీఎల్ వ్యూహాత్మక అడుగు 8లో



నేటి నుంచి 'టెన్త్' మూల్యాంకనం 8లో

న్యూస్‌రీల్

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఎన్టీఆర్ కాలనీల గృహ నిర్మాణ పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించేందుకు కాంట్రాక్టర్లు, అధికారులు సమష్టి కృషి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. రోజుకు 100 నుంచి 150 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. లేఅవుట్ల వారీగా సమీక్షించిన కలెక్టర్ అక్కడ చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. క్షేత్ర స్థాయిలో కాంట్రాక్టర్లతో శత శాతం పని చేయించాలని, నిర్దేశిత లక్ష్యాల మేరకు నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. క్షేత్ర స్థాయి సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. హౌసింగ్ పీడీ ఎస్.డి.సి.సత్తిబాబు, ఈఈ, డీఈలు, ప్రత్యేక అధికారులు, ఏఈలు పాల్గొన్నారు.

దివ్యాంగులతో 'యూఎస్ నేవీ' ముచ్చట్లు



దివ్యాంగులతో కుందన్ గాజులు తయారు చేస్తున్న నేవీ అధికారులు

సీతంపేట: ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా అక్కయ్యపాలెంలోని ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీలోని దివ్యాంగులతో బుధవారం 25 మంది యూఎస్ నేవీ అధికారులు కాసేపు ముచ్చటించారు. దివ్యాంగ పిల్లలతో కలిసి అలంకరణ వస్తువులు, కుందన్ గాజులు, వేలాడదీసే వస్తువులు, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ వంటి తయారీలో పాలుపంచుకున్నారు. కాన్సులేట్ జనరల్ సెంథిల్ కుమార్ సహకారంతో సొసైటీ అధ్యక్షురాలు సుచిత్ర దివ్యాంగ పిల్లలకు నేవీ అధికారులను కలిసే అవకాశం కల్పించారు. పిల్లలను వారికి పరిచయం చేసి, వారిలోని నైపుణ్యాలను, వారి విజయాలను అధికారులకు వివరించారు. సొసైటీ సేవలను నేవీ అధికారులు కొనియాడారు.

ఇసుక కొరత లేకుండా చర్యలు



మహారాణిపేట: రానున్న వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామని, అన్ని ఇసుక డిపోల్లో లక్ష టన్నుల పైగా ఇసుక నిల్వలు ఉంచడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీకాకుళం, రాజమండ్రి నుంచి ఇసుక తీసుకొచ్చి.. గాజువాక, భీమిలి, ముడసర్లోవలోని ప్రైవేట్ ఇసుక డిపోల్లో లక్ష టన్నుల చొప్పున నిల్వ చేస్తామన్నారు. జిల్లాలోని రైతు బజార్ల మరమ్మతులకు రూ.50 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు జేసీ వివరించారు. జిల్లాలో భూముల రీసర్వే చురుగ్గా సాగుతోందన్నారు.

ముత్యాల తలంబ్రాలు అందజేత



ముత్యాల తలంబ్రాలు అందిస్తున్న దాత శివశంకర్‌రాజు, కుటుంబ సభ్యులు

సింహాచలం: ఈ నెల 8న జరిగే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవానికి నగరంలోని ద్వారకానగర్‌కు చెందిన శివశంకర్‌రాజు అనే దాత 4.1 కిలోల ముత్యాల తలంబ్రాలను బుధవారం అందించారు. కుటుంబ సభ్యులతో కలిసి సింహాచలం వచ్చిన ఆయన ఆలయ సూపరింటెండెంట్ బీవీవీఎస్‌కే ప్రసాద్‌కు ఆ ముత్యాలను అందజేశారు.

టీటీసీ శిక్షణకు దరఖాస్తులు

విశాఖ విద్య: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో టెక్నికల్ ట్రైనింగ్ కోర్సు(టీటీసీ)లో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. www.bsc.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో తగిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటికి సంబంధించిన పత్రాలను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈ నెల 25లోపు అందజేయాలని తెలిపారు.



విశాఖ నగరిపై నెత్తుటి మరకలు

సాక్షి, విశాఖపట్నం/అల్లిపురం: ప్రశాంత విశాఖ నగరం నెత్తుటి మరకలతో ఎర్రబడుతోంది. వరుస నేరాలతో ఉలిక్కి పడుతోంది. తరచూ లైంగికదాడులు, హత్యలు, దొంగతనాలు, దాడుల భయం నీడలా వెంటాడుతోంది. సిటీ ఆఫ్ డెస్టినీగా పిలుచుకునే సుందర విశాఖ నగరంలో రోజూ ఏదో ఒక నేర నమోదుతో ప్రజల్లో కలవరం మొదలైంది. కూటమి పాలనలో అరాచక శక్తులకు, అడ్డాగా మారిందనే ఆందోళన అందరిలోనూ కనిపిస్తోంది. ఒక విషాదం తర్వాత మరొకటి జరుగుతుండటంతో నగరంలో ఏం జరుగుతుందోనన్న భయం అందరిలోనూ నెలకొంది. మూడు వారాల క్రితం పెదగదిలిలో ఐదు నెలల కుమార్తెని కన్నతల్లి హత్య చేసిన ఘటన మరవక ముందే.. కొమ్మాదిలో ఘోరం అందర్ని కలచివేసింది. పెళ్లికి అంగీకరించడం లేదనే కోపంతో ప్రేమోన్మాది నవీన్.. విచక్షణా రహితంగా చెలరేగిపోయాడు. మిట్ట మధ్యాహ్నం రెండు చాకులతో తల్లీ కూతుళ్లపై ఉన్మాదంతో చెలరేగిపోయాడు. ఈ దాడిలో తల్లి మృత్యుఒడికి చేరుకోగా.. కుమార్తె ప్రాణాలతో పోరాడుతోంది. ఈ ఘటన విశాఖనే కాదు యావత్ రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఉమ్మడి విశాఖ జిల్లాలోనే హోం మంత్రి ఉన్నా.. మహిళల భద్రత గాల్లో దీపంలా మారిపోయింది. శాంతి భద్రతలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది.

అంతలోనే మరో అమానుషం

ప్రేమోన్మాది ఘాతుకం జరిగిన కొద్ది గంటల్లోనే మరో అమానుష ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మతిస్థిమితం లేని మహిళకు చెరకు రసం ఇస్తానని చెప్పి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఓ దుండగుడు అత్యాచారం చేశాడు. **మహిళ తల్లిదండ్రులు ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకొని పోలీసుల్ని ఆశ్రయించారు. గత నెల 26న 8 ఏళ్ల చిన్నారిపై** పలుమార్లు లైంగిక వేధింపులకు పాల్పడిన కీచకుడి ఘటన యావత్ నగరాన్ని షాక్‌కు గురిచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెరుగుతున్న నేరాలతో నగర ప్రజలు భయంభయంగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

అప్పట్లో 'దిశ'తో రక్షణ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దిశ యాప్ ద్వారా మహిళలకు రక్షణ కల్పించింది. యాప్‌పై పూర్తి అవగాహన కల్పించటంతో మహిళలు యాప్‌ను వినియోగించుకుని రక్షణ పొందేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దిశ చట్టాన్ని నీరుగార్చారు. దీంతో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒక మహిళ హోంమంత్రిగా ఉండి కూడా మహిళలపై దాడులు జరుగుతున్నా పట్టించుకోక పోవటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం మాటలతోనే సరిపెడుతున్నారు తప్ప క్షేత్రస్థాయిలో శాంతిభద్రతలు కొరవడ్డాయని ఆందోళన వ్యక్తమవుతోంది. మహిళలు ఒంటరిగా ప్రయాణించాలన్నా, ఎక్కడికైనా వెళ్లాలన్నా భయపడుతున్నారు. మహిళ రక్షణ కోసం ఉపన్యాసాలు ఇచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరుస ఘటనలతో బెంబేలు

ఒకప్పుడు శాంతిభద్రతలకు నెలవుగా మారిన విశాఖ వరుస ఘటనలతో వణికిపోతుంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మహిళలపై వరుస దాడులతో నగర ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పది నెలల కాలంలో వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

- మూడు రోజుల క్రితం డ్యాన్సర్లు అయిన భార్యాభర్తలు మధ్య జరిగిన గొడవలో.. భర్త చేసిన దాడిలో భార్య గాయపడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.
- మార్చి 31న మధురవాడ వాంబేకాలనీలో ఐదేళ్ల చిన్నారిపై వ్యాయామ ఉపాధ్యాయుడు లైంగికదాడికి పాల్పడ్డాడు.
- మార్చి 29న తండ్రిపై కొడుకు బ్లేడ్‌తో దాడి చేసి హత్య చేసిన ఘటన ఆరిలోవలో చోటుచేసుకుంది.
- మార్చి 28న బర్మా క్యాంపు సమీపంలో హనుమంతరావు అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు చెట్టుకు కట్టి హత్య చేశారు.
- మార్చి 27న సాలూరుకి చెందిన ఐశ్వర్య అనే యువతిని రాంబాబు అనే వ్యక్తి విశాఖలో హత్య చేసి సాలూరు ప్రాంతంలో చెట్టుకు వేలాడదీసి ఆత్మహత్యకు పాల్పడినట్లు చిత్రీకరించాడు.
- మార్చి 20న గాజువాక శ్రీ నగర్‌లోని ఇంట్లో జరిగిన దొంగతనంలో 15 తులాల బంగారాన్ని అపహరించారు.



కొమ్మాదిలో జరిగిన సంఘటన : హత్యకు గురైన తల్లి లక్ష్మి మృతదేహం

- ఫిబ్రవరి 28న ఐదేళ్ల బాలికపై ఓ షాప్ సెక్యూరిటీ గార్డ్ మేడమీదకు తీసుకెళ్లి అఘాయిత్యం చేసేందుకు ప్రయత్నించాడు. బాలిక కేకలు వెయ్యడంతో స్థానికులు ఈ దారుణాన్ని అడ్డుకున్నారు.
- ఫిబ్రవరి 5న హెచ్‌బీకాలనీ సింహాద్రిపురంలో పదేళ్ల బాలికపై 35 ఏళ్ల గణేష్ అనే వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు.
- మార్చి 2న ద్వారకాపోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న ఇంటిని పగలగొట్టి 30 తులాల బంగారం, రూ.45 వేల క్యాష్ చోరీకి పాల్పడ్డారు.
- మార్చి నెలలో అంగడిదిబ్బ ప్రాంతానికి చెందిన మహిళను ఫైనాన్స్ వ్యాపారులు వేధిస్తుండటంతో అప్పు ఇచ్చిన వారి ఇంట్లోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడింది.
- జనవరిలో పీఎం పోలీస్ స్టేషన్ పరిధిలో మిథిలాపురి వుడా కాలనీలో ఒక మహిళను నడి రోడ్డుపై జుట్టుపట్టుకుని ఈడ్చుకెళ్లిన ఘటన సంచలనం రేపింది.

క్రికెట్ అభిమానులకు శుభవార్త

డిసెంబర్ 6న భారత్– దక్షిణాఫ్రికా వన్డే మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: విశాఖ క్రికెట్ అభిమానులకు బీసీసీఐ శుభవార్త చెప్పింది. దక్షిణాఫ్రికా జట్టు భారత్ పర్యటనలో భాగంగా రెండు టెస్ట్ మ్యాచ్‌లు, మూడు వన్డేలు, ఐదు టీ–20 మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్‌లో భాగంగా చివరిదైన మూడవ వన్డే మ్యాచ్ డిసెంబర్ 6న వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరగనుంది. విశాఖపట్నం ఇప్పటివరకు 11 వన్డేలకు ఆతిథ్యం ఇచ్చింది. అయితే దక్షిణాఫ్రికా ఈ వేదికపై మొదటిసారిగా వన్డే ఆడనుంది. అలాగే విశాఖ వేదికగా మూడు టెస్ట్ మ్యాచ్‌లు జరగ్గా.. ఒక టెస్ట్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఆడింది. ఇక్కడ జరిగిన ఆరు టీ–20 మ్యాచ్‌ల్లో ఒకసారి దక్షిణాఫ్రికా జట్టు భారత్‌తో తలపడింది.

న్యాయవాదుల సంక్షేమమే లక్ష్యం



అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్, చిత్రంలో పూర్వ అధ్యక్షుడు సత్యనారాయణ

విశాఖ లీగల్: న్యాయవాదుల సంక్షేమమే తమ లక్ష్యమని విశాఖ న్యాయవాదుల సంఘం నూతన అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్ అన్నారు. జిల్లా కోర్టులోని న్యాయవాదుల భవనంలో బుధవారం ఆయన ప్రమాణస్వీకారం చేశారు. పూర్వ అధ్యక్షుడు బేవర సత్యనారాయణ నూతన కమిటీతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయవాదులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, నూతన గ్రంథాలయం, సులభంగా ఉన్నత న్యాయస్థానాల తీర్పులను పొందడానికి తగిన సాంకేతికత అందిస్తామన్నారు. అవసరమైతే కార్పొరేట్ సంస్థలతో మాట్లాడి తగిన విధంగా నిధులు సమకూరుస్తామని చెప్పారు. జూనియర్ న్యాయవాదులకు సంపూర్ణ సహకారం అందించడంతోపాటు శిక్షణ ఇస్తామన్నారు. క్యాంటీన్ నిర్వహణ, మౌలిక సదుపాయాలు వంటివి సత్వరమే పూర్తి చేస్తామని చెప్పారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, సభ్యులు బైపా అరుణ్ కుమార్, పి.నర్సింగరావు, సీనియర్ న్యాయవాదులు కొలగాని అప్పారావు, సంఘం ఉపాధ్యక్షులు చింతపల్లి ఆనంద్ కుమార్, కార్యదర్శి ఎల్.పార్వతీనాయుడు, మహిళా ప్రతినిధి కింజారపు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

'జేఈఈ' పరీక్షకు నిమిషం ఆలస్యం

- కన్నీటితో వెనుదిరిగిన విద్యార్థులు
- చినముషిడివాడ అయాన్ డిజిటల్ కేంద్ర నిర్వాహకుడు, హెడ్ కానిస్టేబుల్ ఓవరాక్షన్

పెందుర్తి: చినముషిడివాడ ఐయాన్ డిజిటల్ కేంద్రంలో బుధవారం జేఈఈ మెయిన్ సెషన్–2 పరీక్ష జరిగింది. పేపర్–1 పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కాగా.. నిబంధనల ప్రకారం విద్యార్థులు రెండు గంటల ముందే కేంద్రానికి రిపోర్ట్ చేయాల్సి ఉంది. చాలా మంది విద్యార్థులు సమయానికి చేరుకున్నప్పటికీ.. ఒకటి రెండు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన కొందరు విద్యార్థులను కేంద్రం నిర్వాహకులు, ఎన్‌టీఏ సిబ్బంది అనుమతించలేదు. దీంతో పలువురు విద్యార్థులు సిబ్బందిని అనుమతించమని ప్రాధేయపడ్డారు. అయినా కనికరించకపోవడంతో వారు కన్నీటిపర్యంతమై అక్కడి నుంచి వెనుదిరిగారు. కాగా.. పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఓ హెడ్ కానిస్టేబుల్ ఆలస్యమైన విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. ఐయాన్ కేంద్రం సిబ్బందితో కలిసి విద్యార్థులను బలవంతంగా కేంద్రం బయటకు లాక్కుంటూ వెళ్లారు. దీన్ని కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధుల పట్ల హెచ్‌సీ దురుసుగా ప్రవర్తించాడు. ఆలస్యమైతే విద్యార్థులను గౌరవప్రదంగా అక్కడి నుంచి పంపించాలి తప్ప, ఇలా లాక్కుంటూ వెళ్లడం సరికాదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.



అనుమతించకపోవడంతో కన్నీటిపర్యంతమైన విద్యార్థిని



ఆలస్యం కావడంతో నిరాశతో వెనుదిరుగుతూ..



విద్యార్థులతో పోలీస్ వాగ్వాదం

రేషన్‌కు ఈకేవైసీ గండం

- ఈ నెల 30 వరకు గడువు పెంపు
- పూర్తికాకుంటే రేషన్‌తో పాటు సంక్షేమ పథకాలు కట్

జిల్లాలో రేషన్ కార్డుల్లో సభ్యులు	15,91,448
ఈ కేవైసీ పూర్తయినవారు	14,26,463
ఇంకా చేయించుకోని వారు	1,49,385

మహారాణిపేట: సంక్షేమ పథకాలను అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్న కూటమి ప్రభుత్వం.. ఉన్న వాటిని తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా పేదలపై ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్(ఈకేవైసీ) అస్త్రాన్ని సంధించింది. ఈనెల 30వ తేదీలోగా రేషన్ కార్డుదారుల్లో వేలిముద్రల ప్రక్రియ పూర్తి చేయాలని హుకుం జారీ చేసింది. ఈ ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడం వెనుక రేషన్‌లో కోత విధించాలనే దురుద్దేశం ఉందనే విషయం తేటతెల్లమవుతోంది. రైస్ కార్డు ఈ–కేవైసీ చేయించుకోనివారికి వచ్చే నెల రేషన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాల్లో కోత విధించే అవకాశం ఉందని ప్రచారం విస్తృతంగా సాగుతోంది.

మందకొడిగా..

రేషన్ కార్డులో ఈకేవైసీ నమోదు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈకేవైసీ లేకపోతే సరుకులు కట్ అవుతాయని ప్రచారం వల్ల పిల్లలు, పెద్దలు, వృద్ధులు, వేలిముద్రలు పడని వారు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. సచివాలయాలు, మీసేవ, ఆధార్ నమోదు కేంద్రాల వద్ద ప్రజలు తాకిడి ఎక్కువైంది. మరోపక్క సర్వర్ సమస్య వల్ల మందకొడిగా ఈకేవైసీ జరుగుతున్నది. జిల్లాలో మొత్తం 5,12,619 కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల్లో ఉన్న 15,91,448 మంది సభ్యులకు గాను మార్చి 31వ తేదీ నాటికి 14,42,063 మంది సభ్యుల ఈకేవైసీ పూర్తయింది. ఇంకా 1,49,385 మంది సభ్యుల ఈకేవైసీ పూర్తి కావల్సి ఉంది.

అదనపు వసూళ్లు

ఈకేవైసీ పేరిట కొంత మంది వసూళ్లకు పాల్పడుతున్నారు. రేషన్, ఇతర సంక్షేమ పథకాలు ఈకేవైసీతో ముడిపెట్టడంతో కొంతమంది దండుకుంటున్నారు. రేషన్ డీలర్లు, గ్యాస్ డీలర్ల పేరిట ఈకేవైసీ చేస్తామని కార్డుదారులకు ఫోన్లు చేస్తున్నారు. తాము మీకు దగ్గరలో ఉన్నామని, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు పట్టుకొని రావాలని, అలాగే వచ్చేటప్పుడు డబ్బులు కూడా తెచ్చుకోవాలని ఫోన్‌లో చెబుతున్నారు. దీంతో ఉచితంగా చేయాల్సిన ఈకేవైసీ కోసం ప్రజలు డబ్బులు తీసుకొని పరుగులు పెడుతున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న చిరు ఉద్యోగులు, కూలీ పనులకు వెళ్లినవారు ఇంటిబాట పడుతున్నారు.



గ్యాస్ సబ్సిడీకి కూడా..

గ్యాస్ సబ్సిడీకి కూడా ఈకేవైసీ అడ్డంగా నిలిచింది. రేషన్ కార్డుదారులకు సర్కార్ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తోంది. తొలి విడతగా మార్చి 31వ తేదీలోగా జిల్లాలో అన్ని కేటగిరీల్లో 93,784 మంది గ్యాస్ సిలిండర్ల కోసం బుక్ చేసుకోగా ఇంకా కొంత మందికి ఈకేవైసీ కాకపోవడం, ఇతర సాంకేతిక సమస్యల వల్ల సబ్సిడీ డబ్బులు పడలేదు. జిల్లాలో 8,90,345 మంది గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. ఇందులో తెల్లరేషన్ కార్డు కలిగినవారు 5,12,619 మంది ఉన్నారు.

రేషన్ డిపోల్లో ఏర్పాట్లు చేశాం

రేషన్‌కార్డుల్లో ఉన్న సభ్యులంతా ఈనెల 30వ తేదీలోగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి. ప్రతి రేషన్ డిపోలో ఇందుకు ఏర్పాట్లు చేశాం. 5 సంవత్సరాల లోపు.. 80 సంవత్సరాల దాటిన వాళ్లకు ఈకేవైసీ అవసరం లేదు. 6 నుంచి 60 సంవత్సరాలలోపు గల కార్డు సభ్యులు రేషన్ డీలర్ వద్ద నమోదు చేసుకోవాలి. డీలర్ అందుబాటులో లేకపోతే సచివాలయ వీఆర్‌వో లేదా తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోని సంప్రదించాలి. సమీపంలోని ఏఎస్‌వో కార్యాలయంలోనూ సంప్రదించవచ్చు.

– కళ్యాణి, ఇన్‌చార్జి, డీఎస్‌వో, విశాఖ జిల్లా

విపత్తులను ఇలా ఎదుర్కొందాం

ఉత్కంఠభరితంగా మాక్‌డ్రిల్



ఇంట్లో చిక్కుకున్న వ్యక్తిని రక్షిస్తూ...



అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని చికిత్స కోసం తీసుకెళ్తున్న సిబ్బంది



లీకేజీ అయిన గ్యాస్ సిలిండర్ తరలిస్తున్న సిబ్బంది



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తీసుకెళ్తున్న వైద్య సిబ్బంది

మహారాణిపేట: భూకంపం వస్తే ఏం చేయాలి? సునామీ వస్తే ఎలా తప్పించుకోవాలి? అగ్ని ప్రమాదం సంభవిస్తే ఎలా స్పందించాలి? ఇలాంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎలా అప్రమత్తంగా ఉండాలో జిల్లా ప్రకృతి విపత్తుల నిర్వహణ శాఖ అవగాహన కల్పించింది. మహారాణిపేటలోని జబర్‌తోటలో బుధవారం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. కళ్లెదుటే ప్రమాదం జరుగుతుంటే ఎలా స్పందించాలో ప్రత్యక్షంగా చూపించారు. భూకంపం వచ్చినప్పుడు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవడం, అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించడం వంటి దృశ్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. డీపీఎం కళావతి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అగ్నిమాపక, పోలీసు, జీవీఎంసీ, రెవెన్యూ, వైద్యారోగ్య, ఆర్అండ్‌బీ, పరిశ్రమలు, సివిల్ సప్లైస్, పశుసంవర్ధక, ఈపీడీసీఎల్, గ్రామీణ నీటి సరఫరా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పబ్లిక్ హెల్త్ సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

విశాఖ అగ్రపీఠాధిపతిగా ఉడుమల బాల

నేడు బాధ్యతల స్వీకరణ



డాక్టర్ ఉడుమల బాల

డాబాగార్డెన్స్: విశాఖ రోమన్ క్యాథలిక్ మిషన్(ఆర్‌సీఎం) చర్చిల అగ్రపీఠాధిపతిగా వరంగల్ బిషప్ డాక్టర్ ఉడుమల బాల గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ చర్చి ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏలూరు బిషప్, విశాఖ అగ్రపీఠం పరిపాలనాధికారి పొలిమేర జయరావు ఈ వివరాలు వెల్లడించారు. ఆర్‌సీఎం పోప్ ఫ్రాన్సిస్ ఉడుమల బాలను అగ్రపీఠాధిపతిగా నియమించారు. గురువారం సాయంత్రం 4 గంటలకు జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్స్ కళాశాల ఫర్ వుమెన్ గ్రౌండ్స్‌లో గ్రూప్ ఫొటోగ్రాఫ్‌తో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. అనంతరం సెయింట్ పీటర్స్ కెథడ్రల్ గ్రౌండ్స్‌కు ఊరేగింపుగా వెళ్తారు. సాయంత్రం 5.30 గంటలకు దివ్యపూజ వేడుక ప్రారంభమవుతుంది. ఆర్‌సీఎం పోప్ ఫ్రాన్సిస్ ప్రతినిధి, భారత్–నేపాల్ దేశాల ఆర్‌సీఎం సంస్థల అంబాసిడర్ డాక్టర్ లియోపోల్డో గిరెల్లి సమక్షంలో, హైదరాబాద్ అగ్ర పీఠాధిపతి కార్డినల్ పూల ఆంథోనీ చేతుల మీదుగా ఉడుమల బాల బాధ్యతలు చేపట్టనున్నారు. సమావేశంలో ఫాదర్లు జొన్నాడ జాన్‌ప్రకాశ్, బాలశౌరి, కోన జయరాజ్, బి.సురేష్‌బాబు, సిస్టర్ సాండ్రినా, సిస్టర్ నీలప్పన రోజ్, ఫాదర్ ప్రదీప్, పీపీసీ అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఖైదీలకు మజ్జిగ పంపిణీ

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలోని ఖైదీలకు గురువారం నుంచి మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు జైలు సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జైలులో సుమారు 2వేల మంది శిక్ష పడిన ఖైదీలు, రిమాండ్ ఖైదీలు ఉన్నారు. వీరికి మధ్యాహ్న భోజనంలో భాగంగా రెండు నెలల పాటు ప్రతి రోజూ 250 ఎంఎల్ మజ్జిగ ఇవ్వనున్నారు. ఖైదీలను కలవడానికి వచ్చే వారి కోసం రెండు రోజుల్లో చలివేంద్రం ఏర్పాటు చేస్తామని సూపరింటెండెంట్ తెలిపారు.

రైల్వే ఉద్యోగాలకు 'రాంకీ' ఉచిత శిక్షణ

అగనంపూడి : రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించిన గ్రూప్ డీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు రాంకీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ గ్రీన్‌లాండ్స్ ప్రతినిధులు ఎం.వి.రామిరెడ్డి, గద్దె భాస్కర్, లక్ష్మీకుమారి తెలిపారు. మూడు సంస్థలు సంయుక్తంగా తెలుగు రాష్ట్రాల్లోని అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఈనెల 5వ తేదీన అర్హత పరీక్ష నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అర్హత పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు శ్రీధర్ సీసీఈ సంస్థ ఆధ్వర్యంలో నాలుగు నెలలపాటు హైదరాబాద్‌లో ఉచిత శిక్షణతోపాటు ఉచిత వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ అందజేస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు 95156 58033 నంబర్‌ను సంప్రదించాలని ఆ సంస్థల సూచించారు.

బాధితులకు రూ.లక్ష పరిహారం అందజేత

విశాఖ సిటీ: రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా ఇద్దరు బాధితులకు రూ.లక్ష పరిహారం అందజేశారు. ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మొండెం రామకృష్ణ, జన సన్యాసప్పడులకు చెరో రూ.50 వేలు చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 32 మంది బాధితులకు రూ.26.5 లక్షల పరిహారాన్ని ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అందించినట్లు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. హిట్ అండ్ రన్ కేసుల్లో ఎవరికైనా సహాయం కోసం రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రంలో గానీ టోల్‌ఫ్రీ నంబర్ 7995095793కు సంప్రదించాలని సూచించారు.

ఈపీడీసీఎల్ వ్యూహాత్మక అడుగు


నగరంలో జరిగిన కేబుల్ పనులు



సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) తన ఆదాయాన్ని పెంచుకోవడానికి సరికొత్త మార్గాలను అన్వేషిస్తోంది. మహా విశాఖ నగరంలో విద్యుత్ అంతరాయాలను తగ్గించడానికి, రీస్ట్రక్చర్డ్ యాక్సిలరేటెడ్ పవర్ డెవలప్‌మెంట్ అండ్ రిఫార్మ్స్ ప్రోగ్రామ్(ఆర్‌ఏపీడీఆర్‌పీ) కింద జోన్-1 పరిధిలో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థను ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చింది. భూగర్భ విద్యుత్ కేబుల్స్ వేసినప్పుడే.. ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్(ఓఎఫ్‌సీ)ను కూడా ఏపీఈపీడీసీఎల్ ఏర్పాటు చేసింది. సుమారు 218 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ ఫైబర్ నెట్‌వర్క్‌ను ఇప్పుడు ఆదాయ వనరుగా మార్చుకోవాలని సంస్థ నిర్ణయించింది. ఈ ఓఎఫ్‌సీ నెట్‌వర్క్‌ను లీజుకు ఇవ్వడం ద్వారా టెలికాం, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు అవకాశం కల్పించాలని ఏపీఈపీడీసీఎల్ భావిస్తోంది. ఇందు కోసం ఆసక్తిగల సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) టెండర్లను ఆహ్వానించింది. తద్వారా ఏటా సుమారు రూ.200 కోట్ల వరకు అదనపు ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. విద్యుత్ రంగ సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో విశాఖలో అమలు చేసిన ఈ ప్రాజెక్ట్.. ఇప్పుడు ఏపీఈపీడీసీఎల్‌కు అదనపు ఆదాయాన్ని తెచ్చిపెట్టే మార్గంగా మారింది.

48 సంస్థలకు అవకాశం

ఈపీడీసీఎల్ విద్యుత్ కేబుళ్లతో పాటు ప్రత్యేక ట్యూబ్ వేసింది. ఈ ట్యూబ్‌లో 8 చిన్న ట్యూబ్స్ ఉండగా, ప్రతి ట్యూబ్‌లో 12 ఫైబర్ కేబుల్స్ చొప్పున మొత్తం 96 కేబుల్స్ ఉన్నాయి. ట్రాన్స్‌మిట్‌కు ఒక ఫైబర్, రిసీవర్‌కు ఒక ఫైబర్.. ఇలా ఒక్కో కనెక్షన్ కోసం రెండు ఫైబర్లు అవసరం కాబట్టి, ఈ కేబుల్స్‌ను 48 సంస్థలకు ఇచ్చే అవకాశం ఉంది. అయితే కేబుల్స్ వేసిన సమయంలో ఈపీడీసీఎల్‌లో సాంకేతిక నిపుణులు అందుబాటులో లేకపోవడంతో వాటి టెర్మినేషన్, టెస్టింగ్ నిర్వహించలేదు. ప్రస్తుతం ఈ కేబుల్స్ నిర్వహణ, టెస్టింగ్, టెర్మినేషన్ కోసం ఈపీడీసీఎల్ ఆసక్తిగల సంస్థల నుంచి ఈవోఐ ఆహ్వానించింది. ఈ ప్రతిపాదన ప్రకారం ఎంపికైన సంస్థ కొన్ని కేబుల్స్ ద్వారా వచ్చే ఆదాయాన్ని తీసుకొని వాటి నిర్వహణ బాధ్యతలు చేపడుతుంది. మిగిలిన ఆదాయాన్ని మాత్రం ఈపీడీసీఎల్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. నెట్‌వర్క్ ఆపరేషన్ సెంటర్ (ఎన్‌వోసీ) నుంచి ఇంటర్నెట్‌కు కేబుల్స్‌ను అనుసంధానం చేసే సమయంలో, ఎండ్ ఎక్విప్‌మెంట్‌పై కేబుల్ సామర్థ్యం ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ఎండ్ ఎక్విప్‌మెంట్ 1,000 గిగాబైట్స్ వరకు సామర్థ్యాన్ని కలిగి ఉంది.

నెలకు రూ.20 కోట్ల వరకూ ఆదాయం

ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం బీఎస్ఎన్ఎల్ ఒక జత కేబుల్‌కు కిలోమీటరుకు నెలకు రూ.20 వేల వరకు వసూలు చేస్తోంది. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ లిమిటెడ్(పీజీసీఎల్) అయితే కిలోమీటరుకు రూ.28,000 వసూలు చేస్తోంది. ఈ లెక్కన ఈ ప్రాజెక్టు ద్వారా ఈపీడీసీఎల్ నెలకు రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు ఆదాయం ఆర్జించవచ్చని అంచనా వేస్తున్నారు. ఇలా లీజుకు ఇవ్వడం ద్వారా ఏడాదికి దాదాపు రూ.200 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈవోఐ ప్రక్రియలో వచ్చిన సంస్థల పనితీరును పరిశీలించడానికి ఈపీడీసీఎల్ ఒక ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్, ఏపీట్రాన్స్‌కో డీఈఈ, ఈపీడీసీఎల్ నుంచి టెలికాం ఈఈ, స్కాడా ఈఈ, ఐటీ, ఆపరేషన్ సీఎస్, ఫైనాన్స్ సీజీఎం ఉన్నారు.

910 కిమీ ఫైబర్ కేబుల్ వేసేందుకు మరో ఈవోఐ



తొలి విడతలో పూర్తి చేసిన పనుల్లో ముందుచూపుతో ఫైబర్ కేబుల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చాం. దీని ద్వారా వచ్చే ఆదాయంతో డిస్కమ్ పరిధిలోని వినియోగదారులకు మరిన్ని ఆధునిక సేవలు, నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రయత్నిస్తాం. రీవ్యాంప్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్(ఆర్‌డీఎస్ఎస్) కింద మరో 910 కిలోమీటర్ల మేర భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందులో కూడా ఫైబర్ కేబుల్స్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. గత ప్రాజెక్టులో మేమే ఫైబర్ కేబుల్స్ వేశాం. ఈసారి కేబుల్ ఏర్పాటుతో పాటు పదేళ్ల నిర్వహణకు ఈవోఐని పిలిచాం. దీనిపై కూడా త్వరలోనే స్పష్టత వస్తుంది.

– పృథ్వీతేజ్ ఇమ్మడి, సీఎండీ, ఏపీఈపీడీసీఎల్

'తిరుమల'లో అవగాహన సదస్సు రేపు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస తిరుమల విద్యాసంస్థల క్యాంపస్‌లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు చైర్మన్ నున్న తిరుమల రావు తెలిపారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పూర్తి చేసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవగాహన సదస్సుకు హాజరు కావాలని కోరారు. ఇంటర్మీడియట్‌తోపాటు జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ వంటి పరీక్షల ద్వారా ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, బిట్స్ వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో సీటు సాధించడానికి ఏ విధంగా సంసిద్ధత కావాలో ఈ సదస్సులో వివరించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 98489 86450, 98489 86451లో సంప్రదించవచ్చు.

చిట్టివలసలో వ్యభిచారం

- ఐదుగురు అరెస్ట్

తగరపువలస: భీమిలి జోన్ పరిధిలోని చిట్టివలస సుఖీభవ కాలనీలో గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్న ఐదుగురిని టాస్క్‌ఫోర్, భీమిలి పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వీరిలో నిర్వాహకురాలితో పాటు బయట ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నట్టు సమాచారం. కాలనీవాసులకు తెలియకుండా యజమాని నుంచి అద్దెకు ఇల్లు సంపాదించిన మహిళ.. రెండు నెలలుగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఎట్టకేలకు కాలనీవాసులే విషయం తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలీసులు సుదీర్ఘంగా విచారణ చేపట్టారు. వివరాలు మాత్రం వెల్లడించలేదు. పోలీసులు జరిపిన సోదాల్లో ముప్పావు కిలో వరకు గంజాయి లభించినట్టు సమాచారం.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి

మధురవాడ: కొమ్మాదిలో తల్లీకూతుళ్లపై విచక్షణారహితంగా దాడిచేసిన ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలని ఐద్వా, సీఐటీయూ సంఘాలతో పాటు సీపీఐ డిమాండ్ చేశాయి. ఈ వ్యవహారంలో హోం శాఖ మంత్రి అనిత తక్షణమే జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి కోరారు. జస్టిస్ వర్మ కమిషన్ సిఫార్సులు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రేమోన్మాది నవీన్‌కు బెయిల్ ఇవ్వకుండా అతని తరఫున ఎవరూ వాదించకుండా చూడాలన్నారు. మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని సీపీఐ నాయకుడు వి.సత్యనారాయణ, మహిళా సంఘం నాయకురాలు ఎంఏ బేగం కోరారు.

నేటి నుంచి 'టెన్త్' మూల్యాంకనం

- జిల్లాకు 1.83 లక్షల జవాబు పత్రాలు
- జూబ్లీ హైస్కూల్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

విశాఖ విద్య: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం నగరంలోని జూబ్లీ హైస్కూల్‌లో తగిన ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాలకు సంబంధించి 1.83 లక్షల జవాబు పత్రాలను జిల్లాకు పంపించారు. అదే విధంగా సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ తరగతికి సంబంధించి 2,800 జవాబు పత్రాలు జిల్లాకు చేరాయి. వీటిని ఈ నెల 9వ తేదీలోగా మూల్యాంకనం పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో.. డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. మూల్యాంకనం కోసం 693 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 116 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 235 స్పెషల్ అసిస్టెంట్లు, మరో 7 అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లను నియమించారు. కేటాయించిన జవాబు పత్రాలను గడువులోగా పూర్తి చేసేలా వీరికి డీఈవో దిశానిర్దేశం చేశారు. బుధవారం జూబ్లీ హైస్కూల్‌ను సందర్శించి మూల్యాంకనానికి సంబంధించి చేసిన ఏర్పాట్లు పరిశీలించారు. జూబ్లీ హైస్కూల్‌లో లాంగ్వేజీ సబ్జెక్టులను, ఇదే ప్రాంగణంలో ఉన్న సోఫియా జూనియర్ కాలేజీలో నాన్ లాంగ్వేజీ సబ్జెక్టులకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం చేయనున్నారు. ఈ విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు అదనంగా జనరల్, స్లీపర్ క్లాస్ కోచ్‌లను తాత్కాలికంగా జతచేస్తున్నారు. విశాఖపట్నం-బ్రహ్మపూర్-విశాఖపట్నం (18526/ 18525) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 2 జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను జతచేస్తున్నారు. విశాఖపట్నం-రాయ్‌పూర్-విశాఖపట్నం (58528/ 58527) పాసింజర్‌కు ఈ నెల 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌ను జతచేస్తున్నారు. విశాఖపట్నం-కోరాపుట్-విశాఖపట్నం (58538/58537) పాసింజర్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌ను జతచేస్తున్నారు. విశాఖపట్నం-బ్రహ్మపూర్-విశాఖపట్నం (58532/ 58531) పాసింజర్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను జతచేస్తున్నారు. విశాఖపట్నం-భవానీపట్నం-విశాఖపట్నం (58504/ 58503) పాసింజర్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను జతచేస్తున్నారు.

ఎండ దెబ్బ.. స్కూటీపైనే నిద్ర..



వేసవి అప్పుడే మంట పుట్టిస్తోంది. ఎండ తీవ్రతకు నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పనులు ఉన్న వారు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఉపాధి కోసం వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారు ఎండ వేడిమికి తట్టుకోలేక చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. సిరిపురం ప్రాంతంలో డబ్ల్యూఎస్ఎస్ వెనుక కనిపించిన ఈ దృశ్యం వేసవి తీవ్రతకు అద్దం పడుతోంది. ఓ వాహనదారుడు చెట్టు నీడలో ఆగి.. తన స్కూటీపైనే సేద తీరుతున్నాడు.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అనుమానం పెనుభూతమై..

- భర్త దాడిలో చికిత్స పొందుతూ భార్య మృతి


రమాదేవి(ఫైల్)

అల్లిపురం: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త కొట్టడంతో తీవ్రంగా గాయపడిన భార్య చికిత్స పొందుతూ మృతి చెందింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి.. వెంకటేశ్వరమెట్టకు చెందిన పోలిపల్లి రమాదేవి, భీమ్‌నగర్‌కు చెందిన బంగార్రాజు భార్యాభర్తలు. ఇద్దరూ వృత్తిరీత్యా డ్యాన్సర్లు. రమాదేవి యాంకరింగ్ కూడా చేస్తుంటుంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే రమాదేవి యాంకరింగ్ చేయడం బంగార్రాజుకు ఇష్టం లేదు. ఈ విషయమై ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీనికి తోడు ఆమె వేరే వ్యక్తితో సన్నిహితంగా ఉంటోందని బంగార్రాజు అనుమానించడంతో గొడవలు మరింత పెద్దవయ్యాయి. ఈ క్రమంలో గత నెల 31న గొడవ జరగడంతో.. రమాదేవి పిల్లలను తీసుకుని వెంకటేశ్వరమెట్టలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. అదే రోజు బంగార్రాజు అక్కడికి వెళ్లి, తిరిగి ఇంటికి రమ్మని భార్యను పిలిచాడు. ఆమె అందుకు నిరాకరించడంతో.. ఆగ్రహంతో ఆమెను ఇంటి నుంచి బయటకు లాగి చెంపపై కొట్టాడు. ఈ ఘటనలో ఆమె పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో తలకు బలంగా గాయమైంది. వెంటనే ఆమెను కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించింది. మృతురాలి బంధువులు బంగార్రాజుపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బంగార్రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కేసు దర్యాప్తులో ఉంది.

మున్సిపల్ కార్మికుల్ని పర్మినెంట్ చేయాలి

- ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆందోళన


ర్యాలీలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దును విరమించుకోవాలని,కాంట్రాక్ట్ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సిటు) ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులు, వెటర్నరీ, మలేరియా, పార్కులు, నీటి సరఫరా, యూజీడీ, క్లాప్ డ్రైవర్లు, లోడర్లు, ఎకో వాహనాల డ్రైవర్లు, ఇతర అవుట్‌సోర్సింగ్ కార్మికులు రైల్వే డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ మెయిన్ ఆఫీసు మీదుగా గాంధీ విగ్రహం వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఉమామహేశ్వరరావుతో పాటు జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం కార్మిక వ్యతిరేకంగా గతంలో పనిచేసిందని, ఇప్పుడూ అవే విధానాలు కొనసాగిస్తోందన్నారు. గతంలో పని భద్రత లేకుండా జీవో 279ను తెచ్చారని, రాష్ట్ర వ్యాప్త సమ్మెలు చేసి రద్దు చేయించుకున్నామన్నారు. అదే పరిస్థితి మళ్లీ తీసుకురావొద్దని కోరారు. కూటమి పార్టీలను గెలిపిస్తే జీవో ఆర్టీ నెం.96 ప్రకారం మినిమం టైం స్కేల్(ఎంటీఎస్) అందిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు టైం స్కేల్ ఇచ్చే సమస్య లేదని, గ్రాట్యుటీ కూడా వర్తించదని చెప్పడాన్ని ఆక్షేపించారు. సమ్మె ఒప్పందం ప్రకారం గ్రాట్యుటీ రూ.85 వేలు, మట్టి ఖర్చులు రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. టి.నూకరాజు సభాధ్యక్షత వహించిన కార్యక్రమంలో కార్మిక నాయకులు యు.రాజు, జి.అప్పారావు, ఒ.అప్పారావు, కృష్ణ నాయుడు, ఎం.వి.ప్రసాద్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, నాని పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి


ట్రస్టీ రామకోటయ్యను సత్కరిస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలోని కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించేందుకు పూర్తి కృషి చేస్తానని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ట్రస్టీ చెరువు రామకోటయ్య హామీ ఇచ్చారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రీజియన్ ట్రస్టీగా చెరువు రామకోటయ్య నియమితులైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం సిరిపురంలోని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఆయన్ని అసోసియేషన్ విశాఖపట్నం పాలకవర్గం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా రామకోటయ్య మాట్లాడుతూ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం చాప్టర్‌కు అధ్యక్షుడిగా, జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ ఉపాధ్యక్షుడిగా, పలు జాతీయ కమిటీల్లో అధ్యక్షుడిగా 30 ఏళ్లుగా సేవలందించిన తనకు కమిటీలో ట్రస్టీగా అవకాశం కల్పించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు సీహెచ్ నవనీత్, కార్యదర్శి ఎం.ఎస్.మూర్తి, కోశాధికారి జి.వి.సుబ్బారావు, ఐఎంఎం పూర్వ అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్లు, ఆర్.వెంకటేశ్వరరావు, ప్రముఖ బిల్డర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.